
సాక్షి
గుంటూరు
సోమవారం । 13 । మే । 2024



వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: చిలకలూరిపేట-నరసరావుపేట మార్గంమధ్యలోని వీరాంజనేయస్వామి ఆలయ 12 వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుడివాడకు చెందిన నల్లమోతు శ్యామలదేవి రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



ఏఎన్‌యూ: జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ , తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్ లతో కలసి ఆదివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్స్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది నుంచి ఈవీఎంలను తీసుకునే రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల నుంచి యూనివర్సిటీ లోపలికి వాహనాలు రావడం, తిరిగి వెళ్లే వాహనాలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఈవీఎంలు స్వీకరించిన అనంతరం వాటిని సంబంధిత స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే మార్గాల్లో బారికేడింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని, పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్, పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాపట్ల చేరుకున్న ప్రత్యేక పరిశీలకులు మిశ్రా

బాపట్ల: ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించేందుకు ఏపీ ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా ఆదివారం బాపట్లకు చేరుకున్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎన్నికల పోలీస్ పరిశీలకులు కెప్టెన్ అయ్యప్ప, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



విడదల రజిని (గుంటూరు పశ్చిమ)



మేకతోటి సుచరిత (తాడికొండ)



షేక్ నూరిఫాతిమా (గుంటూరు తూర్పు)



మురుగుడు లావణ్య (మంగళగిరి)



అన్నాబత్తుని శివకుమార్ (తెనాలి)



అంబటి మురళీకృష్ణ (పొన్నూరు)



బలసాని కిరణ్‌కుమార్ (ప్రత్తిపాడు)

వార్ వన్ సైడ్

జిల్లాలో ఫ్యాన్‌దే హవా

- గెలుపుదిశగా దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు
- వెనుకబడ్డ తెలుగుదేశం
- గత టీడీపీ ప్రభుత్వం చేసిన అక్రమాలు, మోసపు వాగ్దానాలను గుర్తు తెచ్చుకుంటున్న ఓటర్లు
- మద్దతు ఇవ్వని బీజేపీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓట్లపండుగ రానే వచ్చింది. విశ్వసనీయతతో పాటు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వమని కోరుతోంది. మరోవైపు 2014లో తమ ప్రభుత్వం ఉన్నప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం , కాల్‌మనీ, అక్రమ మైనింగ్ నిర్వహించి పుడమి తల్లికి గర్భశోకం మిగిల్చి, నీరు, చెట్టు, ఇసుక, మట్టి అమ్ముకుని ధనార్జనకు పాల్పడ్డ పార్టీ మరో వైపు తప్పుడు వాగ్దానాలతో ప్రజల ముందు నిలిచింది.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు బ్రహ్మరథం..

రుణాల మాఫీ పేరుతో మోసం చేసిన తెలుగుదేశం ప్రభుత్వానికన్నా చెప్పిన మాటకు కట్టుబడ్డ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే తమకు ఇష్టమని రైతులు, మహిళలు ముక్తకంఠంతో చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారు. జిల్లాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన మేమంతా సిద్ధం బస్సుయాత్రకు, తర్వాత జరిగిన ముఖ్యమంత్రి సభలకు జనం పోటెత్తారు. 2019కి మించిన ప్రజాదరణ కనపడుతోంది. మరోవైపు జిల్లాను చంద్రబాబునాయుడు చుట్టేసినా ఆయన సభలకు ఆదరణ కనపడలేదు. ప్రజలు, ముఖ్యంగా మహిళలు వైఎస్సార్ సీపీకి స్టార్ క్యాంపెయినర్లుగా మారడం పార్టీకి కలిసివస్తోంది.

సత్తా చూపనున్న 'ఫ్యాన్'

వైఎస్సార్ సీపీ ప్రజలే తన స్టార్ క్యాంపెయినర్లు అంటూ ముందుకు వచ్చింది. ఐదేళ్ల కాలంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సుమారు రూ.18 వేల కోట్లు ఖర్చు పెట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మళ్లీ పట్టం కట్టనున్నారు. గుంటూరు జిల్లాలో మరోసారి సత్తా చూపే దిశగా ఫ్యాన్ దూసుకువెళ్తోంది.

మరోసారి సత్తా చాటే దిశగా...

అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాను మళ్లీ కైవసం చేసుకునే దిశగా ముందుకు వెళ్తోంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులు నియోజకవర్గాన్ని చుట్టేశారు. విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేయడం, ఇంటింటికి తిరగడం పార్టీకి బాగా కలిసివస్తోంది. ఇక పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో నిర్వహించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేశారు.

- గుంటూరు తూర్పు నుంచి నూరిఫాతిమా, గుంటూరు పశ్చిమ నుంచి మంత్రి విడదల రజని, తెనాలి నుంచి అన్నాబత్తుని శివకుమార్, ప్రత్తిపాడు నుంచి బలసాని కిరణ్‌కుమార్, తాడికొండ నుంచి మాజీ మంత్రి మేకతోటి సుచరిత, పొన్నూరు నుంచి అంబటి మురళీకృష్ణ, మంగళగిరి నుంచి మురుగుడు లావణ్య తమ ప్రచారాలను దిగ్విజయంగా పూర్తి చేశారు.

పక్కా లోకల్ 'కిలారి'



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కిలారి వెంకట రోశయ్య లోకల్ అభ్యర్థి కావడం కలిసొచ్చే అంశం. ఆయన పక్కా లోకల్ అన్న నినాదంతోనే ప్రజల ముందుకు వెళ్తున్నారు. గెలుపుపై ధీమాతో దూసుకుపోతున్నారు. గుంటూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎన్ఆర్ఐ పెమ్మసాని చంద్రశేఖర్ పోటీ చేస్తున్నారు. గతంలో రెండుసార్లు గెలిచిన చిత్తూరు జిల్లాకు చెందిన గల్లా జయదేవ్ గెలిచిన తర్వాత అందుబాటులో లేకుండాపోయారు. నియోజకవర్గాన్ని పట్టించుకోలేదు. సామాన్య ప్రజలు కలవలేని పరిస్థితి. కేవలం డబ్బు ఉందన్న అండతో రంగంలోకి దిగిన పెమ్మసాని డబ్బులు పంచి గెలవాలని చూస్తున్నారు.

టీడీపీలో కలవరం..

అదే సమయంలో తెలుగుదేశంలో పెమ్మసాని చంద్రశేఖర్ పెద్ద ఎత్తున డబ్బులు కుమ్మరించడం , వైఎస్సార్ సీపీ చోటా నాయకులను ప్రలోభాలకు గురిచేసి కొనుగోళ్లు చేసినా ప్రజల నుంచి అనుకున్నంత ఆదరణ కనపడకపోవడం వారిని కలవరపెడుతోంది. దిగుమతి నేతతో స్థానిక నేతలకు సమస్యలు వచ్చాయి. బీజేపీ నేతలు తమను అవమానించారంటూ ప్రచారానికి కూడా దూరంగా ఉంటూ వచ్చారు. వీరి ఓట్లు బదిలీ అవుతాయన్న నమ్మకం కూటమి లో కనపడటం లేదు. మరోవైపు కాపు సామాజికవర్గం పూర్తిగా వ్యతిరేకంగా ఉంది. కాపులకు సీటు రాకుండా పెమ్మసాని అడ్డు పడ్డారన్న భావన వారిలో ఉంది. ఇదే సమయంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థితో పాటు, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా కూడా కాపుల నుంచి నిలబెట్టడంతో వారి నుంచి సంపూర్ణ మద్దతు వైఎస్సార్ సీపీకి అందుతోంది. పొత్తుల్లో భాగంగా తెనాలి జనసేనకు కేటాయించగా ఇక్కడ సీటు ఆశించిన ఆలపాటి రాజా మొక్కుబడిగా మద్ద తు ఇవ్వడంతో తెనాలిలో నాదేండ్ల మనోహర్ వెనుకబడ్డారు.

- మంగళగిరిలో మరోసారి తన అదృష్టాన్ని పరిశీలించుకుంటున్న లోకేష్‌కు కూడా ప్రజల నుంచి స్పందన రాలేదు. దీంతో చివరి వారం రోజులు ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే డబ్బుమూటలతో గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మిగలిన అభ్యర్థుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు.

మెప్మా ఆర్పీలపై ప్రలోభాల వల

పోలీసులకు ఉప్పందటంతో విఫలం



పోలీసుల రాకతో వెళ్లిపోతున్న ఆర్పీలు

తెనాలి: మెప్మాలో రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)గా పనిచేస్తున్న కొందరు మహిళలకు ప్రలోభపెట్టేందుకు ప్రతిపక్ష కూటమి నేతలు చేసిన ప్రయత్నం విఫలమైంది. తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ఇంటికి అతి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఇందుకు వేదికైంది. మధ్యాహ్నం కొందరు ఆర్పీలు అక్కడకు చేరుకున్నారు. ఆసుపత్రి ముందు తెనాలి మున్సిపాలిటీ అన్న నేమ్‌ప్లేట్‌తో పలు ద్విచక్ర వాహనాలు ఉండటం చూసి స్థానికులు మీడియాకు, పోలీసులకు ఫోన్లు చేశారు. దీంతో అక్కడకు చేరుకున్న మీడియాతో మదర్స్ డే వేడుకలకు వచ్చామని ఆర్పీలు చెప్పారు. అప్పటికప్పుడు కేక్‌ను కూడా తెప్పించారు. అంతలో పోలీసులు రావటంతో చేసేదిలేక తిరుగుముఖం పట్టారు. మదర్స్‌డే పేరుతో ఆర్పీలను రప్పించి, ప్రలోభపెడదామని కూటమి పార్టీ నేతలు చేసిన ప్రయత్నాన్ని స్థానికులు ఆవిధంగా విఫలం చేశారు.

కేంద్రాల్లోకి మొబైల్స్ అనుమతించం

ప్రత్తిపాడు: పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్స్‌ను అనుమతించబోమని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ తెలిపారు. నేడు జరగనున్న ఎన్నికలకు సంబంధించిన వివరాలను ఆర్ఓ వెల్లడించారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించిన గుర్తింపు కార్డు లేదా ఐడీ కార్డులను వెంట తీసుకువెళ్లాలన్నారు.

అమరావతి అభివృద్ధిపై బాబు పాతపాటే

- విజయవాడ, గుంటూరుకు మొండిచేయి చూపేందుకా?
- రెండు నగరాల పరిసర ప్రాంతాలకు రిక్తహస్తమేనా
- 29 గ్రామాల్లో రియల్ వ్యాపారానికి ప్రణాళికే కదా
- గ్రీన్‌జోన్ పేరిట ఆనాడు టీడీపీ చేసింది అదేగా
- భవన నిర్మాణాలకు అనుమతులూ ఇవ్వలేదు
- ఆ అయిదేళ్లు నష్టపోయామని వాపోయిన నగరవాసులు
- అందుకే గుంటూరు, కృష్ణా జిల్లాల్లో టీడీపీకి దారుణ ఫలితాలు
- మళ్లీ మోసానికి తెరతీసిన చంద్రబాబు



సాక్షి ప్రత్యేక ప్రతినిధి: అమరావతి రాజధాని అభివృద్ధి పేరిట కష్టా, గుంటూరు జిల్లాల ప్రజలను మరోసారి మోసగించడానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తెరతీశారు. ముఖ్యంగా విజయవాడ, గుంటూరు నగరాలతో పాటు పరిసర ప్రాంతాల వారిని మోసపు మాటలతో మభ్యపెట్టే ప్రయత్నాలు ఆరంభించారు. గత సాధారణ, కార్పొరేషన్, మునిసిపల్ ఎన్నికల్లో రెండు నగరాలు, వాటికి చుట్టుపక్కల ఉన్న నియోజక వర్గాల ఓటర్లు తెలుగుదేశంకు గట్టిగా బుద్ధి చెప్పినా ఒక వేళ తమ కూటమి గెలుపొందితే అమరావతిని అభివృద్ధి చేస్తానంటూ మళ్లీ పాతపాటే పాడుతున్నారు. 2014–2019 మధ్య కాలంలో ప్రపంచం మెచ్చే రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతానంటూ ఓవైపు భ్రమలు కలిస్తూ మరోవైపు గ్రీన్‌జోన్ పేరిట విజయవాడ, గుంటూరు నగరాలతో పాటు పరిసర నియోజక వర్గాల ప్రగతిని దారుణంగా దెబ్బతీశారు. గ్రీన్ జోన్ తమకు శాపంగా మారిందని అప్పట్లో మాజీ మంత్రి, సీనియర్ రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు వేదికలపై నుంచి ఎలుగెత్తి చాటిన సందర్భాలు ఉన్నాయి.

వ్యాపార ఎత్తుగడలో భాగమే గ్రీన్‌జోన్ : రియల్ వ్యాపార ఎత్తుగడలో భాగంగా రాజధాని ప్రాంతంగా ఎంపిక చేసిన 29 గ్రామాల్లో చంద్రబాబు, తన కోటరీ రియల్ వ్యాపారం పెంచుకోవడానికి వీలుగా ఆనాటి ఏపీసీఆర్‌డీఏ పరిధిలో వ్యవసాయం పరిరక్షణ పేరిట గ్రీన్‌జోన్ ఏర్పాటు చేశారు. గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, గుడివాడ, నందిగామ, జగ్గయ్యపేట, నూజివీడు, గన్నవరం నియోజ కవర్గాల పరిధిలోని 5,440 చదరపు కిలోమీటర్ల మేర ఈ జోన్ ఏర్పాటైంది. గ్రీన్‌జోన్ పరిధిలోని భూముల్లో భవన నిర్మాణాలకు అనుమతి ఉండదు. ఈ జోన్ పరిధిలో అనుమతించిన వాటిని మాత్రమే అభివృద్ధి చేయాల్సి ఉంటుందనే షరతు ఉండేది. క్యాపిటల్ జోన్ పరిధిలో ఉన్న భూములు విక్రయించాలన్నా, కొనుగోలు చేయాలన్నా స్థానిక ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్ల నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రం (నో అబ్జక్షన్ సర్టిఫికెట్- ఎన్‌ఓసి) పొందాలి. ఈ నిబంధన తమను ఇబ్బందులకు గురిచేయడానికేనని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు కూడా.

గ్రీన్‌జోన్ వల్ల తగ్గిన స్థిరాస్తి వ్యాపారం

5,440 చదరపు కిలోమీటర్ల పరిధిలో గ్రీన్ జోన్ ఏర్పాటుతో ఆ పరిధిలోని ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం బాగా పడిపోయింది. నగర, పట్టణ, నివాస ప్రాంతాల్లో క్రయవిక్రయాలు సాగక యజమానులు ఇబ్బందులు పడ్డారు. తమ అత్యవసర పనులకు కూడా భూములను విక్రయించుకోలేని దుస్థితి భూయజమానులకు ఏర్పడింది. దీనిపై పలు రకాల ఆందోళనలు జరిగాయి. 1700కు పైగా అభ్యంతరాలు ఏపీసీఆర్‌డీఏకి అప్పట్లో అందాయి. గ్రీన్‌జోన్‌ను రద్దు చేయాలనే వినతులు వచ్చాయి. అగ్రికల్చర్ జోన్ 1,2,3 ల నుంచి తమ పరిధిలోని ప్రాంతాలను తప్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు భూ యజమానులకు మద్దతుగా పలుసార్లు ఉన్నతాధికారులకు సూచించారు. తమ రాజకీయ ప్రయోజనాలకు, పార్టీకి దీర్ఘకాలిక నష్టం వాటిల్లుతుందని తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు వాపోయారు కూడా. దీనిపై రైతుల సందేహాలను తీర్చుతామంటూ గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అవగాహనా కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. గ్రీన్ జోన్, అగ్రికల్చర్ జోన్‌ల మధ్య వ్యత్యాసం ఉందని, క్రమంగా అభివృద్ధి జరుగుతుందంటూ రైతులకు ఒప్పించడానికి అధికారులు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు.

జగన్ సర్కారులో రద్దు

రాజధాని అమరావతి పరిధిలో ఉన్న గ్రీన్‌జోన్‌ను జగన్ సర్కార్ రద్దుచేసింది. ఈ నిర్ణయం వల్ల నివాస ప్రాంతాలకు 500 మీటర్లు దాటి కూడా అనుమతులు ఇవ్వడానికి సీఆర్‌డీఏకి అనుమతి లభించింది. ఈ నిర్ణయం వల్ల రాజధాని అమరావతిలో భూముల ధరలు బాగా పడిపోతాయని చంద్రబాబు, ఆయన బృందం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఒకవేళ తాను అధికారంలోకి వస్తే అమరావతిని అభివృద్ధి చేస్తానని చంద్రబాబు వల్లెవేస్తున్నారు. కాగా గ్రీన్‌జోన్ కష్టాలు ఇంకా తొలగలేదని రైతులు అక్కడక్కడా వాపోతుండటం పరిశీలనాంశం. మళ్లీ రాజధాని అమరావతిని బూచిగా చూపించి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో బాబుకు ఓటర్లు తమ ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

తమ భూముల ధరలు పెంచుకునేందుకే

తాడికొండ, పాత అమరావతి, పరిసర గ్రామాల్లో భూముల ధరలు తగ్గేలా, ప్రతిపాదిత రాజధాని గ్రామాల్లో భూముల ధరలు పెంచుకునేందుకు తమ ప్రాంతాలను గ్రీన్‌జోన్ పరిధిలోని తీసుకువచ్చారని రైతులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. చంద్రబాబు మోసపు ఎత్తుగడలను గుర్తించినందునే రాజధాని పరిధిలోకి వచ్చే తాడికొండ నియోజకవర్గంలోని ఓటర్లు సైతం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారు. గుంటూరు, విజయవాడతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని మెజారిటీ స్థానాలు వైఎస్సార్‌సీపీకి దక్కాయి. గుంటూరు, విజయవాడ కార్పొరేషన్ల ఎన్నికల్లోనూ టీడీపీ మట్టికరిచింది.

క్లుప్తంగా

ఘనంగా స్వామివారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్‌లోని గౌరీ విశ్వేశ్వరస్వామి వారి దేవాలయంలో స్వామివారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. కల్యాణ ఉత్సవంలో యల్లాప్రగడ ప్రభాకర్‌శర్మ, పద్మజ, ఎన్వీ సుబ్బారావు, సుధారాణి, చింతల పాటి ఉమా మహేశ్వరరావు, హిమబిందు తదితర దంపతులచే అర్చక స్వామి విశ్వేశ్వర శర్మ కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రమణ్యశాస్త్రి, మల్లిఖార్జునశర్మ, చక్రపాణి, గిరి, కల్యాణ్ పాల్గొన్నారు.

ఆసియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మెరిసిన షబీనా

హాంకాంగ్‌లో జరిగిన పోటీల్లో నాలుగు బంగారు పతకాలు కైవసం



జాతీయ పతాకంతో షేక్ షబీనా

తెనాలి: హాంకాంగ్‌లో జరిగిన ఆసియన్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ కమ్ ఆసియన్ యూనివర్శిటీ కప్–2024 పోటీల్లో తెనాలికి చెందిన పవర్‌లిఫ్టర్ షేక్ షబీనా మెరిసింది. ఈనెల 6నుంచి 11వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో చివరిరోజు జూనియర్ విభాగంలో పోటీపడిన షబీనా స్క్వాట్, బెంచ్‌ప్రెస్, డెడ్‌లిఫ్ట్‌లో బంగారు పతకాలను సాధించింది. మూడు విభాగాల్లో కలిపి టోటల్‌లోనూ మరో పతకంతో మొత్తం నాలుగు బంగారు పతకాలను సాధించినట్టు కోచ్ షేక్ సంధాని తెలిపారు. గత రెండేళ్లుగా పవర్‌లిఫ్టింగ్‌లో నిలకడగా విజయాలను సాధిస్తున్న షబీనా గత ఏడాది కేరళలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ ఇదే రీతిలో నాలుగు బంగారు పతకాలను కైవసం చేసుకుంది. అంతకుముందు హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ మూడు బంగారు పతకాలు, రజత పతకం సాధించింది. అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటాలని అభిలషించిన షబీనా, ఆసియా పోటీల్లో వరుసగా రెండేళ్లు నాలుగేసి బంగారు పతకాలను గెలుచుకోవడం విశేషం.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



గ్రామంలో ప్రజలతో మాట్లాడి తగు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డీడీ

- పెదపరిమి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ తుషార్ డీడీ
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు

పెదపరిమి(తాడికొండ): ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరగాలని జిల్లా ఎస్పీ తుషార్ డీడీ అన్నారు. ఆదివారం తుళ్ళూరు మండలంలోని అత్యంత సమస్యాత్మక కేంద్రమైన పెదపరిమి పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ తుషార్ డీడీ పరిశీలించారు. మేరిమాత పబ్లిక్ స్కూల్, ఎంపీపీ స్కూల్, ఆది ఆంధ్రా న్యూ బిల్డింగ్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలు, బందోబస్తుకు సంబంధించి లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ, ఎస్సై అశోక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం పాఠశాల చుట్టు పక్కల నివాసం ఉంటున్న ప్రజలతో మమేకమై సమస్యాతక పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతను వివరించారు. బారికేడ్ల ఏర్పాటు, ఓటర్ల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర విధి విధానాలపై క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ రోజున 100 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్ప మరెవ్వరూ ఉండకుండా చూడాలన్నారు. వేసవి నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మౌలిక సదుపాయలపై అన్ని శాఖల అధికారుల సమన్వయంతో తీసుకోవాల్సిన చర్యలు దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల సమయంలో ఈ పోలింగ్ కేంద్రంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ఎన్నికల రోజు ముందస్తుగా పోలీసు వారు తీసుకునే చర్యలకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎవరైనా ఎన్నికల నియమావళి అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సీ విజిల్ యాప్ ద్వారా లేదా టోల్ ఫ్రీ నంబర్ 112 లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ డీడీ, ఐపీఎస్, లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ వెంకట్రావు, ఎస్సై అశోక్ కుమార్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు సకల సౌకర్యాలు

- పూర్తిస్థాయి వసతులతో సిద్ధమైన పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు మౌలిక వసతుల కల్పన
- పాఠశాలల్లో సౌకర్యవంతంగా విధుల నిర్వహణకు ఏర్పాట్లు
- కూర్చునేందుకు ఫర్నీచర్, అన్ని గదుల్లో సీలింగ్ ఫ్యాన్లు, ఎల్ఈడీ లైటింగ్ వ్యవస్థ
- పురుషులు, మహిళా ఉద్యోగులకు వేర్వేరుగా అందుబాటులో టాయిలెట్లు
- గుంటూరు జిల్లాలో 1,915 పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు
- ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు



గుంటూరు చౌత్రాలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ పోలింగ్ కేంద్రం



గుంటూరు స్తంభాలగరువులోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం



నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో సీలింగ్ ఫ్యాన్లు, లైట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్షేమం, అభివృద్ధి కలగలసిన ప్రజా రంజక పరిపాలనతో ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కు అభివృద్ధి సార్వత్రిక ఎన్నికల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం జరగనున్న ఎన్నికల నిర్వహణకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో మౌలిక వసతులతో విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా విధులు నిర్వహించే అవకాశాన్ని ప్రభుత్వం కలిగించింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 289 ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో కనీస ప్రాథమిక మౌలిక వసతుల కల్పన కింద ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించింది. నియోజకవర్గానికి ఒక ఎంఈవోను నోడల్ అధికారిగా నియమించిన ఉన్నతాధికారులు ఎన్నికల సంఘ నిబంధనల మేరకు అవసరమైన పనులను పూర్తి చేయించారు. ఈ విధంగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,915 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటైన 289 పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంటుతో తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్, ఫర్నీచర్ సదుపాయాలను స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌తో పూర్తి చేశారు. నాడు–నేడు మొదటి దశలో ఆధునీకరించిన పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉండటంతో పాటు రెండో దశలో చేపట్టిన పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించారు. జిల్లాలోని 1,915 పోలింగ్ కేంద్రాల్లో 1,630 పోలింగ్ కేంద్రాలు పూర్తిగా విద్యాశాఖ పరిధిలో ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో 80 శాతానికి పైగా నాడు–నేడు ద్వారా అభివృద్ధి పర్చిన పాఠశాలల్లోనే ఉండటంతో ఆయా కేంద్రాల్లో వసతుల కల్పనకు పెద్దగా కష్టపడకుండా అన్ని వసతులు కల్పించింది. ఆదివారం పోలింగ్ సామగ్రితో వెళ్లిన ఉద్యోగులకు పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉన్న మౌలిక వసతులతో ఊపిరి పీల్చుకున్నారు.

భగ్గుమన్న దళితులు



అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

- టీడీపీ పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి భర్త రామచంద్రయ్య నోటిదురుసు
- దళితులపై నోరు పారేసుకున్న వైనం
- ఆగ్రహంతో ఆందోళనకు దిగిన దళిత వర్గాలు
- 34వ డివిజన్ కోబాల్డ్ పేటలో ఆదివారం రాత్రి ఘటన

లక్ష్మీపురం: గుంటూరు తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి భర్త రామచంద్రయ్య నోటి దురుసుగా ప్రవర్తించారు. దళితుల పట్ల పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేయడంతో వారు ఆందోళనకు దిగారు. పశ్చిమ నియోజకవర్గం కోబోల్డ్‌పేట ప్రాంతంలో దళిత వర్గాలకు సంబంధించి రామచంద్రయ్య రాత్రి అక్కడ చేరుకుని వారిపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేశారు. రామచంద్రయ్య వ్యాఖ్యలతో మండిపడ్డ స్థానికులు ఆదివారం రాత్రి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. దళితుల ఓట్లు తనకు అవసరం లేదంటూ వారిపై నోరు పారేసుకోవడంతో దళిత వర్గాలు మనస్థాపాన్ని గురై ఆందోళన చేపట్టారు. సుమారు గంటన్నరకు పైగా ఆందోళన జరిగింది. రామచంద్రయ్య క్షమాపణలు చెప్పాలంటూ దళిత వర్గాల సభ్యులు ఆందోళనకు దిగి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దళితుల పట్ల టీడీపీ నేతలు చిన్న చూపుతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు దగ్గర నుండి ఆ పార్టీ కింద స్థాయినేతల వరకు దళితులంటే తొలి నుండి అవమానకరంగానే మాట్లాడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సైతం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని అన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ టీడీపీ అభ్యర్థిగా మాధవి, రామచంద్రయ్య క్షమాపణ చెప్పాల్సిందేనని తేల్చిచెప్పారు. పోలీసులు స్థానిక ఎన్నికల నేపథ్యంలో సహకరించాలని కోరడంతో వివాదం సద్దుమణిగింది.

పసిప్రాణాలను బలిగొన్న నిద్రమత్తు

చినగంజాం: డ్రైవర్ నిద్రమత్తు ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలితీసుకుంది. హృదయ విదాకరమైన ఈ సంఘటన చినగంజాం రొంపేరు వంతెన సమీపంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, హైవే సిబ్బంది అందించిన సమాచారం ప్రకారం ఆదివారం ఉదయం 7.45 గంటల సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న కారు ఢీకొట్టిన సంఘటనలో ఇరువురు చిన్నారులు మృతి చెందగా ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి కాలు విరిగింది. దీనికి సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే యల్లావుల వెంకటేశ్వర్లు ఉప్పుగుండూరులో స్వీట్లు తయారు చేసే పనిలో ఉంటున్నాడు. అతనిది బాపట్ల స్వగ్రామం కాగా 7 నెలలుగా ఉప్పుగుండూరులో నివాసముంటున్నాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు యల్లావులు దేవి సంధ్య (12), జస్విత (9), అశ్విని (7) ఉన్నారు. ఆదివారం తన కుటుంబంతో కలిసి బాపట్లలో ఓటు వేసేందుకు బయలు దేరాడు. వెంకటేశ్వర్లు, అతని భార్య ఒక ద్విచక్ర వాహనంపై, మరొక ద్విచక్ర వాహనంపై అతనికి సోదరుడి వరుస అయిన వెంపరాల లక్ష్మణ్ అతనితో పాటు వెంకటేశ్వర్లు ముగ్గురు కుమార్తెలు బాపట్ల బయలు దేరారు. వారు రొంపేరు బ్రిడ్జి సమీపానికి వచ్చేసరికి చిన్నారుల తల్లిదండ్రులు ద్విచక్ర వాహనం వెనుకబడటంతో వారికోసం ఆగి వారు వచ్చిన తరువాత వీరి వాహనం బయలు దేరింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు రాంగ్ రూట్‌లో వచ్చి రోడ్డుకు ఎడమవైపున ఉన్న వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఆ సంఘటనలో యల్లావుల వెంకటేశ్వర్లు పెద్ద కుమార్తె దేవి సంధ్య, చిన్న కుమార్తె అశ్వినిలకు తీవ్రగాయాలయ్యాయి. మరొక కుమార్తె జస్విత సురక్షితం కాగా వాహనం నడుపుతున్న లక్ష్మణ్‌కు ఎడమ కాలు ఫ్యాక్చర్ అయింది. తీవ్ర గాయాలపాలైన ఇద్దరు చిన్నారులను చీరాల వైద్యశాలకు తరలించగా వారు అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కాలు ఫ్యాక్చర్ అయిన లక్ష్మణ్‌ను మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు.

ఓటర్లలో చైతన్యం కోసం మోడల్ పోలింగ్ కేంద్రాలు

తెనాలి పట్టణం, మండలంలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు



చినరావూరులోని ఆదర్శ పోలింగ్ కేంద్రం

తెనాలి రూరల్: ప్రజలందరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ తమ ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం అధికారులు అన్ని చర్యలూ చేపడుతున్నారు. ముఖ్యంగా ఓటర్లలో చైతన్యం కలిగించడంతో పాటు ఓటింగ్ ప్రక్రియను ఆహ్లాదకరంగా మార్చేలా కొన్ని చోట్ల మోడల్ పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశారు. తెనాలి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నాలుగు ఆదర్శ పోలింగ్ కేంద్రాలు, రూరల్ గ్రామాల్లో మరో మూడు ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్‌లోని 54వ పోలింగ్ కేంద్రాన్ని యువజన మోడల్ పోలింగ్ స్టేషన్‌గా, ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో పిఎస్ నెం 110ని పీడబ్ల్యూడీ మోడల్ పోలింగ్ కేంద్రంగా, ఎర్రబడి పోలింగ్ కేంద్రాన్ని మహిళా మోడల్ పోలింగ్ కేంద్రంగా, చినరావూరులోని వాసిరెడ్డి లక్ష్మీపతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పోలింగ్ కేంద్రంగా సిద్ధం చేశారు. ఆయా ఆదర్శ పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటర్లను చైతన్య పరిచే విధంగా ఈ ఏర్పాట్లు చేశారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిళ్లనూ ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌లను ఆయా మోడల్ పోలింగ్ కేంద్రానికి తగ్గట్టుగా అలంకరించారు.

శాంతిభద్రతల పర్యవేక్షణకు 4వేలమంది సిబ్బంది

- 19 కంపెనీలు కేంద్ర బలగాలు
- పల్నాడురోడ్డులో ఫ్లాగ్ మార్చ్
- పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ



పల్నాడు రోడ్డులో కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించే సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో శాంతిభద్రతలు పర్యవేక్షణకు 19 బెటాలియన్ల సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిపి సుమారుగా 4వేల మందిని కేటాయించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, జిల్లా ఎస్పీ ఎల్.శివశంకర్, జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పల్నాడు రోడ్డులోని పల్నాడు బస్టాండ్ సెంటర్ నుంచి పోలీసు, సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలతో మల్లమ్మ సెంటర్ వరకు పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలగాలను పోలీస్‌స్టేషన్ వారిగా క్యాటగిరీ వైజ్ నియమించడం జరిగిందన్నారు. పోలింగ్‌కు కావాల్సిన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రజల్లో భరోసా కలిగించి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా కేంద్ర బలగాలు ఫ్లాగ్‌మార్చ్ చేశాయన్నారు. గత నెలరోజులుగా సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ప్రజలందరికీ ఫ్రీ అండ్ ఫెయిర్ పోలింగ్ పరిస్థితులు కల్పించామని, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

• ప్రగతి ప్రతిబింబాలు



గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ అడ్మినిస్ట్రేటివ్ భవనం



పెదకాకానిలోని గుంటూరు ఛానల్ (కొత్త కాలువ)



పేరేచర్లలోని జగనన్న కాలనీలో నిర్మితమైన గృహాలు, (ఇన్‌సెట్) నూతన గృహం ముందు లబ్ధిదారులు

నేడే ఓట్ల పండుగ

• జిల్లాలో 17,91,543 మంది ఓటర్లు • 1915 పోలింగ్ కేంద్రాలు



- పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు, సిబ్బంది
- జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- ఉదయం 7 గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- దివ్యాంగులు ఓటు వేసేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాస్వామ్యం పరిఢవిల్లే రోజు...అభివృద్ధి అందలమెక్కే రోజు...
సంక్షేమానికి సలాం చేసే రోజు...పెత్తందారీ వ్యవస్థకు పాతరేసే రోజు..
విశ్వసనీయతకు పట్టంకట్టే రోజు, నయ వంచన నడ్డి విరగ్గొట్టే రోజు
మేనిఫెస్టో హామీలను 99 శాతం పైగా నెరవేర్చిన ఘనతను జ్ఞప్తికి తెచ్చే రోజు
హామీలను నూటికి నూరు శాతం తుంగలో తొక్కిన మోసగాడిని ఛీకొట్టే రోజు
మళ్లీ అబద్ధపు హామీలతో రంగంలోకి దిగిన దుష్ట చతుష్టయాన్ని దునుమాడే రోజు
అన్ని హామీలను తిరిగి కొనసాగిస్తామన్న దమ్మున్న నేతకు అండగా నిలిచే రోజు



గుంటూరు ఎల్ఈఎం బీఈడీ కళాశాలలో ఈవీఎంలను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది



ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది



ఈవీఎంల పంపిణీ కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ



పోలింగ్ సామగ్రి తీసుకెళుతున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఓట్ల పండుగ వచ్చింది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేడు జరగనుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. ఉదయం 7 గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 30 మంది, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 132 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జిల్లాలో మొత్తం 17,91,543 మంది తమ ఓటు హక్కు నియోగించుకోనున్నారు.

372 సమస్యాత్మక కేంద్రాలు..

జిల్లాలో 1,915 పోలింగ్ కేంద్రాలో 372 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని గుర్తించారు. ఇక్కడ అదనపు పోలీసు బలగాలను మోహరించడంతో పాటు వెబ్ కాస్టింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో పోలీసులు ఇప్పటికే పర్యటించి తగిన ఏర్పాట్లు చేశారు. 1915 కేంద్రాలకు గాను 1,498 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు కలెక్టరేట్ నుంచి పర్యవేక్షిస్తుంటారు. ఈ బృందానికి అసిస్టెంట్ కలెక్టర్ నేతృత్వం వహిస్తారు. ఎక్కడైనా సమస్య ఏర్పడితే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 487 మందిని మైక్రో అబ్జర్వర్లుగా నియమించగా, పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణకు 176 మందిని సెక్టోర్ ఆఫీసర్లుగా నియమించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్ 0863–2234301 ఏర్పాటు చేశారు.

హోం ఓటింగ్‌కు విశేష స్పందన..

తొలిసారిగా ఏర్పాటు చేసిన హోం ఓటింగ్‌కు కూడా మంచి స్పందన వచ్చింది. జిల్లాలో హోం ఓటింగ్‌కు 2,348 మంది ఎంపిక చేసుకోగా, 2,292 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. 20,397 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ఉపయోగించుకున్నారు.

కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది..

జిల్లాలోని ఏడు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ల నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లను పోలింగ్ సిబ్బంది ద్వారా, ప్రత్యేక పోలీసు బందోబస్తుతో, జిల్లాలోని 1915 పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు 2,300 మంది పోలింగ్ అధికారులు, 2,300 మంది సహాయ పోలింగ్ అధికారులు, 9,800 ఇతర అధికారులను ర్యాండమైజేషన్ చేసి కేటాయింపు చేశారు. వీరందరికీ ఆదివారం ఉత్తర్వులు అందజేశారు. వెంటనే వీరందరూ తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో ఇప్పటికే 20 శాతం అదనంగా ఈవీఎంలను సిద్ధం చేసి ఉంచారు. ఈవీఎంల మొరాయింపు వంటి సమస్యలు ఎదురైతే పరిష్కరించడానికి సెక్టోరల్ అధికారులతో పాటు టెక్నికల్ సిబ్బందిని ప్రతి మండల కేంద్రంలో అందుబాటులో ఉంచారు.

4వేల మంది పోలీసులతో బందోబస్తు...

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు దాదాపు నాలుగు వేల మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. 11 కంపెనీల సీఏపీఎఫ్, ఎస్ఏపీ సిబ్బంది జిల్లాకు చేరుకున్నారు.

ప్రశాంతంగా ఈవీఎంల పంపిణీ

గుంటూరు వెస్ట్: సోమవారం జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారంకలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ, ఆర్డీఓ పి.శ్రీకర్‌తో కలిసి పర్యవేక్షించారు. పంపిణీని టీజేపీఎస్ కళాశాలలో పరిశీలించారు.

సిరా కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తుంది..

ఓటు వేసిన తర్వాత వేలిపై వేసే సిరా ఇతరులకు లభించదని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదివారం తెలిపారు. సిరాపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మొద్దని కోరారు. ఆ సిరాతో ఇతర కార్యక్రమాలు చేయడం నేరమన్నారు.

పెమ్మసానికి దిమ్మతిరిగేనా..

- గుంటూరు లోక్‌సభ పరిధిలో మహిళా ఓటర్లే అధికం
- వైఎస్సార్ సీపీ నుంచి నలుగురు మహిళా అభ్యర్థులు
- అందరూ రాజకీయ నేపథ్యం ఉన్నవారే
- సామాజిక న్యాయం పాటించిన అధికారపార్టీ
- టీడీపీ నుంచి మహిళా అభ్యర్థి ఒక్కరే
- బాబు సామాజికవర్గం నుంచి నలుగురు పోటీ
- రాజకీయ చైతన్యం కలిగిన లోక్‌సభ స్థానంగా గుర్తింపు



విడదల రజిని (వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి)



మేకతోటి సుచరిత (వైఎస్సార్ సీపీ తాడికొండ అభ్యర్థి)



షేక్ నూరిఫాతిమా (వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు అభ్యర్థి)



మురుగుడు లావణ్య (వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి)



కిలారి రోశయ్య (వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి)



పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ ఎంపీ అభ్యర్థి)



గల్లా మాధవి (టీడీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి)

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: రూ.కోట్లు ఉన్నాయని, ప్రలోభాలకు గురిచేసైనా విజయం సాధించగలననే అహంకారంతో విర్రవీగుతున్న తెలుగుదేశం పార్టీ లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఓటర్లు కర్రుకాల్చి వాతపెట్టనున్నారనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేనల నుంచి లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోటీలోని అభ్యర్థుల రాజకీయ అనుభవం, సామాజిక స్థితిగతులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోందని అంటున్నారు. ఏడు అసెంబ్లీ స్థానాలలో తాడికొండ, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్, మంగళగిరిల నుంచి వైఎస్సార్ సీపీ నుంచి మహిళలు పోటీలో ఉన్నారు. టీడీపీ తరఫున గుంటూరు వెస్ట్ నుంచి మాత్రమే మహిళకు అవకాశం ఇవ్వడాన్ని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. గుంటూరు లోక్‌సభ పరిధిలో 59 వేలమంది మహిళా ఓటర్లు అధికం. అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం పాటించలేదనే వ్యతి రేకత టీడీపీపై వ్యక్తమవుతోంది. రాజకీయ చైతన్యం మెండుగా కలిగిన లోక్‌సభ స్థానంగా గుంటూరుకు గుర్తింపు ఉంది. గత ఎన్నికల్లోనూ గల్లా జయదేవ్ స్వల్ప మెజార్టీతో గట్టెక్కిన సంగతి తెలిసిందే.

ఏడింటిలో ఏ ఒక్కరికైనా...

టీడీపీ అభ్యర్థులుగా పోటీపడుతున్న వారిలో గుంటూరు లోక్‌సభ స్థానానికి పెమ్మసాని చంద్రశేఖర్, మంగళగిరి నుంచి నారా లోకేష్, పొన్నూరు నుంచి ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి నుంచి నాదెండ్ల మనోహర్ (జనసేన) లు ఒకే సామాజికవర్గానికి చెందిన వారే. గుంటూరు వెస్ట్ నుంచి రంగంలో ఉన్న గల్లా మాధవి భర్త కూడా బాబు సామాజికవర్గీయుడే. ఆమెను కూడా పై కోటాకు చెందిన అభ్యర్థిగా పరిగణలోకి తీసుకోవాల్సిందేనని టీడీపీ వర్గీయులే అంటున్నారు. ప్రధానపార్టీలు గుంటూరు ఈస్ట్ నుంచి ముస్లింలకు అవకాశం కల్పిస్తుంటాయి. ఇక తాడికొండ, ప్రత్తిపాడు రిజర్వుడు స్థానాలు కావడంతో ఆ సామాజికవర్గాల వారికి ఇవ్వక తప్పదు. మొత్తం మీద ఏడింటిలో నాలుగు స్థానాలలో పోటీకి బాబు తమ వారికే అవకాశం ఇవ్వడాన్ని టీడీపీలోని కాపులు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నుంచి అభ్యర్థుల ఎంపికలో సామాజికన్యాయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. తాడికొండ, ప్రత్తిపాడుల నుంచి రిజర్వుడు, గుంటూరు ఈస్ట్ నుంచి ముస్లింలు పోటీలో ఉన్నారు. లోక్‌సభ, పొన్నూరు అసెంబ్లీ స్థానాలకు కిలారు రోశయ్య, అంబటి మురళీకృష్ణలు పోటీలో ఉన్నారు. వీరివురు కాపు సామాజికవర్గీయులు కాగా తెనాలి నుంచి శివకుమార్ పోటీలో ఉన్నారు.

17.93 లక్షల ఓటర్లులో...

గుంటూరు లోక్‌సభ పరిధిలో 17,93,324 ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 8,67,085, మహిళా ఓటర్లు 9,26,080 ఉన్నారు. అంటే 58,995 మంది మహిళా ఓటర్లు అధికం. వైఎస్సార్ సీపీకి మహిళా ఓటర్ల మద్దతు శాతం అధికమని వివిధ సర్వేలు ఇప్పటికే పలుసార్లు వెల్లడించాయి. మంగళగిరిలో 10,983, తెనాలిలో 9,167, ప్రత్తిపాడులో 8,993, పొన్నూరులో 8,627, తాడికొండలో 7,229, గుంటూరు వెస్ట్‌లో 7,118, గుంటూరు ఈస్ట్‌లో 6,878 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మహిళ అభ్యున్నతి కోరుకుంటూ వారిని పలు పథకాల ద్వారా సహాయం అందజేస్తున్న జగన్ సర్కారు మహిళల పక్షపాతమనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లలో మెజార్టీ వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారని ఇప్పటికే అనేక సర్వేలు వెల్లడించాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్నట్లయితే టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులతో పాటు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు దిమ్మతిరిగే ఫలితాలు తప్పవని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

మహిళలకు అత్యధిక ప్రాధాన్యం...

తాడికొండ (ఎస్సీ) స్థానం నుంచి పోటీలో ఉన్న మేకతోటి సుచరిత మాజీ హోం మంత్రి. ఆమె రాజకీయ అరంగేట్రం స్థానిక సంస్థల ఎన్నికల (జడ్పీటీసీ)లో జరిగింది. సుమారు రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతూ ఎమ్మెల్యేగా, హోంమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. బీసీ వర్గానికి చెందిన విడదల రజని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా కొనసాగుతూ గుంటూరు వెస్ట్ నుంచి పోటీలో ఉన్నారు. మంగళగిరి నుంచి రంగంలో ఉన్న మురుగుడు లావణ్య పుట్టినిల్లు, మెట్టినిల్లు రాజకీయ కుటుంబాలే. ఆమె తల్లి కాండ్రు కమల మాజీ ఎమ్మెల్యే కాగా, మామయ్య మురుగుడు హనుమంతరావు మాజీ మంత్రి. గుంటూరు తూర్పు అభ్యర్థిని షేక్ నూరిఫాతిమా తండ్రి ముస్తఫా ప్రస్తుతం ఎమ్మెల్యే. ప్రతిపాడు నుంచి బలసాని కిరణ్‌కుమార్, పొన్నూరు నుంచి అంబటి మురళీకృష్ణ తొలిసారి పోటీపడుతున్న సంగతి తెలిసిందే.

సంక్షేమాభివృద్ధి మస్తు!

జిల్లాలో సంక్షేమంతో పాటు అభివృద్ధి సంతకం. ఇది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన భరోసా. గడచిన ఐదేళ్ల కాలంలో రెండేళ్లు కరోనా మింగేసినా మిగిలిన మూడేళ్లలోనే అనూహ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి. కులం చూడం, మతం చూడం, ప్రాంతం చూడం, పార్టీ చూడం అని ఎన్నికల ముందు చెప్పిన విధంగానే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమం అందిస్తూ ముందుకు సాగింది. - సాక్షి ప్రతినిధి, గుంటూరు



తెనాలి మండలం పెదరావూరులోని జగనన్న కాలనీ

- గుంటూరు జిల్లాలో రూ. వేల కోట్లతో అభివృద్ధి
- రూ.9,000 కోట్లతో సంక్షేమ పథకాలు
- నాడు – నేడు, ప్రాధాన్యత భవనాలకు రూ.వందల కోట్లు
- జిల్లా వ్యాప్తంగా 1.19 లక్షల ఇళ్ల స్థలాలు...
- సుమారు రూ.8 వేల కోట్ల ఆస్తి అక్క చెల్లెమ్మల చేతుల్లో...
- ఐదేళ్ల ప్రగతి ప్రస్థానం



తెనాలి పూలే కాలనీలో రూ. 30 కోట్లతో నిర్మించిన మురుగునీటి శుద్ధి ప్రాజెక్ట్

గుంటూరు జిల్లాలో అభివృద్ధి శరవేగంగా జరిగింది. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా 311 సచివాలయ భవనాలు, 138 రైతు భరోసా కేంద్రాలు, 346 స్కూళ్ల ప్రహరీ పనులు, 96 వైఎస్సార్ క్లినిక్కులు రూ.627 కోట్ల అంచనాతో పూర్తి చేశారు. 139 బల్క్‌మిల్క్ యూనిట్లు, 165 వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాలు పురోగతిలో ఉన్నాయి. నాడు– నేడు రెండోదశలో భాగంగా 562 స్కూల్స్‌ను రూ.215.08 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు.

గడప గడపకు అభివృద్ధి..

గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు ప్రతి నియోజకవర్గానికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా అక్కడ గుర్తించిన ఇబ్బందులు వెంటనే పరిష్కరించే దిశగా పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా రోడ్లు, డ్రైయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు వెంటనే చేపట్టారు. ఇప్పటివరకూ రూ. 67.14 కోట్ల విలువైన 1029 పనులు మంజూరు అయ్యాయి. 467 పనులు ప్రోగెస్‌లో ఉండగా, 445 పనులు పూర్తి అయ్యాయి.

రూపురేఖలు మారాయి..

సీఎం వైఎస్ జగన్ విద్యావిధానంలో పలు మార్పులు చేపట్టారు. నాడు–నేడు పథకం కింద జిల్లాలోని 1183 పాఠశాలల్లో రూ.289 కోట్లతో నూతన భవనాల నిర్మాణం, పాఠశాల భవనాల ఆధునికీకరణ పనులు చేపట్టారు.

భూములు సొంతం అయ్యాయి...

గుంటూరు జిల్లాలో చుక్కల భూములు, వివిధ కేటగిరిలలో ఉన్న 22ఎ భూములు మొత్తం 2339.15 ఎకరాలను నిషేధిత భూముల జాబి తా నుంచి తొలగించడం జరిగింది. ఇందులో చుక్కల భూముల జాబితా నుంచి 169 సర్వే నెంబర్లకు సంబంధించి 601.36 ఎకరాలు, 22 ఎ లోని వివిధ కేటగిరిల నుంచి 870 సర్వే నెంబర్లకు సంబంధించి 1737.79 ఎకరాలను తొలగించడం జరిగింది. లంక భూముల్లో వ్యవసాయం చేసుకునే రైతులకు లీజుకి ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. కొల్లిపర మండలం అన్నవరం గ్రామంలో 67.72 ఎకరాలలో 182 మంది రైతులు, బొమ్మువాని పాలెంలో 182.56 ఎకరాల్లో 228 మంది రైతులకు ఈ నిర్ణయం వల్ల లబ్ధి చేకూరింది.

లక్షా 20 వేల మందికి ఇళ్ల స్థలాలు..

పేదలందరికీ ఇళ్ల పథకంలో గుంటూరు జిల్లా వ్యాప్తంగా 67,678 ఇళ్లు పేదలకు ప్రభుత్వం కేటాయించింది. తర్వాత 90 రోజుల్లో ఇళ్ల పట్టాల కింద మరో 3190 మందికి స్థలాలను కేటాయించింది ఇందులో ఇప్పటి వరకూ 65,719 ఇళ్ల నిర్మాణం ప్రారంభం అయ్యింది. అందులో పది వేల వరకూ ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యింది. మిగిలిన ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది.. సీఆర్డీయే పరిధిలో 50,793 మంది పేద అక్కచెల్లెమ్మలకు ఇళ్లపట్టాల పంపిణీతో పాటు, రూ.443.71 కోట్లతో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభం అయ్యే సమయంలో తెలుగుదేశం పార్టీ నేతలు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ఈ ఇళ్ల స్థలాల కేటాయింపు ద్వారా జిల్లాలోని మహిళలకు సుమారు రూ.8,400 కోట్ల విలువైన ఆస్తి దక్కింది.

సాగుకు భరోసా..

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎన్నో పథకాలను అమలు చేస్తూ సాగుకు భరోసా ఇచ్చింది. 2019 అక్టోబర్ 15వ తేదీ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా పథకాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద జిల్లాలోని రైతులకు ఐదేళ్లలో రూ.823.27 కోట్లు అందించారు. ఇవేకాకుండా ఇన్‌పుట్ సబ్సిడీ ఏ సీజన్‌కి ఆ సీజన్‌లోనే అందిస్తూ వస్తున్నారు. ఇప్పటివరకూ రూ.200.99 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించారు. కౌలు రైతులు 31,836 మందికి రూ.162.39 కోట్ల రుణాలు అందచేశారు. వైఎస్సార్ యంత్ర సేవ కింద 1877 మంది రైతులకు రూ.8.75 కోట్ల విలువైన యంత్ర పరికరాలు అందించారు. విత్తన సబ్సిడీ కింద రూ.15.91 కోట్ల విలువ చేసే 36,208 క్వింటాళ్ల విత్తనాలను సబ్సిడీపై అందచేశారు. 85,106 మంది రైతులకు రూ.75.50 కోట్ల విలువైన క్రాప్ ఇన్సూరెన్స్ అందచేశారు. 84,807 మంది రైతులకు రూ.21.15 కోట్ల సున్నా వడ్డీ పంటరుణాలు అందించారు.

కొత్తగా 104 పరిశ్రమలు..



మంగళగిరిలో నిర్మించిన చేనేత భవనం

జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోంది. ఈ ఏడాది కొత్తగా 104 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారు. జిల్లాలో కొత్తగా మూడు క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో మంగళగిరిలో చేనేత క్లస్టర్ ఇప్పటికే ప్రారంభం కాగా, తెనాలిలో బంగారు పరిశ్రమ క్లస్టర్స్, దాల్ మిల్ క్లస్టర్ పనులు నడుస్తున్నాయి.

ప్రతి గ్రామానికి ఆసుపత్రి వచ్చింది..



మంగళగిరిలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా ప్రతి విలేజీలోనూ విలేజీ క్లినిక్ వచ్చింది. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎనిమిది నూతన పీహెచ్‌సీ భవనాల నిర్మాణం, 77 పీహెచ్‌సీల భవనాల ఆధునికీకరణకు రూ.49.24 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. 96 వైఎస్సార్ క్లినిక్కులు రూ.627 కోట్ల అంచనాతో నిర్మించారు.

నగరంలో అభివృద్ధి పరుగులు..



గుంటూరు గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన ఆధునిక ఆట పరికరాలు

గుంటూరు నగరంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూ. 491 కోట్లతో కొత్తగా రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గుంటూరు నగర ప్రజల చిరకాల వాంఛగా ఉన్న పీవీకే నాయుడు మార్కెట్ రూ. 163 కోట్లతో నిర్మాణం జరుగుతోంది.